PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 226 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 11 ఆగస్టు 2026


### కొత్త యస్వాడలో హైమాస్ట్ లైట్ల ప్రారంభం



3లో

### కరీంనగర్‌లో ఘనంగా 12 రోజుల జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ నీ వేడుకలు



3లో

# సాగర్‌లో ముగిసిన వరుణయాగం

- పూర్ణాహుతిలో పాల్గొన్న రేవంత్ దంపతులు
- వేకువజామునే క్రతువు ప్రారంభించిన ఉత్తమ్ దంపతులు






**నాగార్జునసాగర్,ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్ వేదికగా 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువును చేపట్టారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు , వేదపండితుల ఆధ్వర్యంలో మిగతా2లో...



# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

## - కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోడీ అభినందనలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):**దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోడీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణ మని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీ నాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పత కాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మో ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని ల్వ్లీనా మిగతా2లో...



# గ్లోబల్ హబ్‌గా తెలంగాణను ఇంధన రంగం అభివృద్ధి

### 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యం లక్ష్యం

### అమెరికా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి

**హైదరాబాద్,ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ మిగతా2లో...

# అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

- అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు
- హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ





**న్యూఢిల్లీ,ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):**పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చి చెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది' మిగతా2లో...



2లో

# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

- ప్రజల అభిమానం చూరగొన్న నేత
- నర్సంపేట కాలేజీకి పెద్ది పేరు పెడతాం
- సంతాపసభలో కేటిఆర్ వెల్లడి

**నర్సంపేట,ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. మిగతా2లో...



# బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు

- రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉంది
- స్వయం శక్తితో ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న
- సచివాలయం ఎదురుగా మహనీయుల విగ్రహాలు ఏర్పాటు
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

**హైదరాబాద్,ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. సర్వాయి పాపన్న వంటి వీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని వివరిస్తూ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎంతో మంది రాజులు, చక్రవర్తులు చరిత్రలో ఉన్నప్పటికీ, చిన్న జాతిలో పుట్టి పోరాటంతో రాజుగా ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న అని అన్నారు. పుట్టుకతోనే చక్రవర్తులుగా మారిన వారితో పోలిస్తే, పాపన్న పోరాడి రాజ య్యారని పేర్కొన్నారు. మేము రాజులమే.. మిగతా2లో...

# ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

- ఎక్కడా కార్యాలయ భవనాల నిర్మాణమేదీ
- భూభారతితో రైతులకు భరోసా కల్పించిన ప్రజాప్రభుత్వం
- గత బిఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ పొంగులేటి
- హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు ప్రారంభం



**హనుమకొండ,ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే వాటికి ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ. 600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో

మిగతా2లో...

# తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

## - రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు





2లో



# రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ

## - ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్,ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత ప్రభుత్వ కేబినెట్ కార్యదర్శి డా. టి.వి. సోమనాథన్ సోమవారం అన్ని రాష్ట్రాలప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మిగతా2లో...

PCW తెలుగు దినపత్రిక



# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోడీ అన్నారు.. ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే... గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించక పోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది. అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. పాక్ బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దని అనేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలను కుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

# గ్లోబల్ హబ్‌గా తెలంగాణను ఇంధన రంగం అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ,క్లైమేట్ సెంటర్'ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యా న్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం , సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం-కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు.సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక , వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

(మొదటి పేజీ తరువాయి)

వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు.లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన పోరాటం, తెలంగాణ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే గా పెద్ది చేసిన శాశ్వత పనులపై చేసిన డాక్యుమెంట్ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. డాక్యుమెంటరీ చూసి పెద్ది భార్య స్వప్న కన్నీరుమున్నీరైంది. కార్యక్రమంలో శాసన మండలి విపక్షనేత సిరికొండ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్, గండ్ర సహా పలువురు నేతలు హాజరయ్యారు.

# బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

మేము కూడా పాలించగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేద, వెనుకబడిన వర్గాల్లో కల్పించిన గొప్ప వ్యక్తి సర్వాయి పాపన్న అని మహేష్ కుమార్ అన్నారు. పేద వర్గాల కోసం పాపన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల పెద్దలతో చర్చించి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహేష్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విగ్రహాలు కేవలం పూలమాలలు వేసేందుకు మాత్రమే కాదని, ఆయా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగేందుకే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మహేష్ కుమార్ అన్నారు. సామాజిక సంస్కర్తలు జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించనున్నట్లు మహేష్ కుమార్ తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు, మహిళలు, పేదల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.రాజకీయాలకు అతీతంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత అనేది రాహుల్ గాంధీ నినాదమని తెలిపారు. అదే నినాదంతో తెలంగాణలో కులగణన చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే అసెంబ్లీలో కులగణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్ర స్థాయిలో మాత్రం దానిని అడ్డుకుంటోందని విమర్శించారు. బీసీలు తమ హక్కుల కోసం పోరాడితే కొందరు దానిని ఇతరులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చిత్రీకరిస్తున్నారని మహేష్ కుమార్ అన్నారు. మా హక్కుల కోసం మేము పోరాడితే.. మాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ కులం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని తెలిసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు మద్దతు ఇచ్చారని, కులగణన చేపట్టారని పేర్కొన్నారు. ఎవరినీ ఇబ్బందులకు గురి చేయకుండా అన్ని కులాలను కలుపుకుని సమాన అవకాశాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్ గౌడ్ పార్టీలకు అతీతంగా బీసీల కోసం, కులాల సంక్షేమం కోసం పనిచేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలతో పాటు ఇతర కులాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్ గాంధీ సూచించారని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ పదవుల్లో కూడా సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. 79 శాతం ఉపాధ్యక్ష పదవులను బీసీలకు ఇచ్చామని, అదే సమయంలో అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించామని మహేష్ కుమార్ వెల్లడించారు. కులాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.

# ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.రైతన్నల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేండ్లలో వేల కోట్లు రైతన్నల కోసం ఖర్చు చేశామని, కనీవినీ ఎరగని విధంగా పంటలు పండించామని ఆయన తెలిపారు. గతంలో సేకరించిన ధాన్యాన్ని స్టోర్ చేసే కెపాసిటీ లేకపోయినా.. చివరి గింజ వరకు కొంటామన్న ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తుచేశారు. హనుమ కొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతులకు సంకెళ్లు వేసి, వరి వేస్తే ఉరి అన్న బీఆర్ఎస్ నాయకులు.. నేడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, పదే పదే ఈ మాట చెప్పడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని.. పదేండ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారే నేడు గోబెల్స్ ప్రచారాలు చేస్తూ ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అని అన్నారు. ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'నేరం'పై ఆయన సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ఓ విద్యార్థి నీట్‌కు సన్నద్ధమైన తాను సర్వం కోల్పోయానని, తనకు ఏ అవకాశాలు మిగల్లేదని ఆవేదనతో తెలిపాడని రాహుల్ వెల్లడించారు. దిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద విద్యార్థుల ఆందోళన ముగిసి చాలా రోజులవుతునప్పటికీ ఇప్పటి వరకూ వారిపై పోలీసుల దాడికి సంబంధించి అమిత్ షా నోటి నుంచి ఒక్క మాట కూడా పెగల్లేదని రాహుల్ విమర్శించారు. మరోవైపు విద్యార్థులకు క్షమాపణ చెప్పడానికి బదులు వారిని క్షమిస్తున్నానంటూ ప్రధాని మోదీ తీరిక లేకుండా ఉన్నారని ఆక్షేపించారు.

# రిఫార్మ్ ఉత్సవ్‌పై కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదించిన 'రిఫార్మ్ ఉత్సవ్ కార్యక్రమం అమలు, కార్యాచరణపై రాష్ట్రాలకు వివరించారు. అక్టోబర్ 2026 నుంచి రిఫార్మ్ ఉత్సవ్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు కేబినెట్ కార్యదర్శి తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను సేకరించి, వాటిని ఆచరణాత్మక సంస్కరణలుగా మార్చి, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.రిఫార్మ్ ఉత్సవ్‌ను మూడు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశగా ఆగస్టు-సెప్టెంబర్ 2026లో సన్నాహక కార్యక్రమాలు చేపట్టనున్నారు. పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు, అధికారుల సెన్సిటైజేషన్, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు ఉంటాయి. రెండో దశ అక్టోబర్-డిసెంబర్ 2026లో రిఫార్మ్ ఉత్సవ్గా నిర్వహించనున్నారు. ఇందులో జన్ మంథన్ కార్యక్రమం అక్టోబర్ 1 నుంచి 31 వరకు, విమర్శ్ జన్ సమాధాన్ కార్యక్రమాలు అక్టోబర్ 10 నుంచి నవంబర్ 30 వరకు నిర్వహించి, త్వరితగతిన అమలు చేయగల సంస్కరణలు, మధ్యకాలిక సంస్కరణలపై దృష్టి సారించనున్నారు. సంకల్ప సిద్ధి కార్యక్రమం అక్టోబర్ 10 నుంచి డిసెంబర్ 20 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నారు. మూడో దశగా డిసెంబర్ 28, 2026 నుంచి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. ఇందులో నిర్మాణాత్మక సంస్కరణలపై నిరంతర పర్యవేక్షణ, తదుపరి చర్యలు మరియు సమర్పణ ఉంటాయి. రిఫార్మ్ ఉత్సవ్ అమలుకు ప్రతి రాష్ట్రంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన స్టేట్ కోఆర్డినేటివ్ కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు స్టేట్ నోడల్ ఆఫీసర్ ను, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు నవీన్ మిట్టల్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

**హైదరాబాద్,ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ పక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది.అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ పక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

# సాగర్‌లో ముగిసిన వరుణయాగం

(మొదటి పేజీ తరువాయి)

108 మంది రుత్వికులు 11 హోమగుండాలతో ఈ మహా యాగాన్ని శాస్త్రోక్తంగా పూజలు జరిపి పూర్తి చేశారు. ఈ వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని హోమగుండంలో పూర్ణాహుతి సామాగ్రిని సమర్పించారు. కృష్ణా, గోదావరి నదులు జలకళను సంతరించుకోవాలని, రాష్ట్రంలోని చెరువులు , రిజర్వాయర్లు నిండి పంటలు సమృద్ధిగా పండాలని సీఎం దంపతులు వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ క్రతువులో పలువురు ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొనగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన మహాపూర్ణాహుతితో ఈ వరుణ యాగం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రాష్ట్రం పాడిపంటలతో విలసిల్లాలని కాంక్షిస్తూ.. ప్రభుత్వం వరుణయాగం నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఆదిపూజ నిర్వహించి యాగ క్రతువును ప్రారంభించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దంపతులు ఈ యాగంలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీమంత్రి జానారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు యాగ క్రతువులో పాల్గొన్నారు.

# మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్న రంగనాథ్

- నాదర్‌గుల్ ఆక్రమణలపై చర్యలు తీసుకుని హైడ్రా
- మీడియాతో చిట్‌చాట్‌లో రాంచంద్రరావు విమర్శలు

**హైదరాబాద్,ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసార్ హాట్ కామెంట్స్ చేశారు. హైకోర్టు చెప్పినా రంగనాథ్ తీరు మారడం లేదని వ్యాఖ్యానించారు. సోమవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. రంగనాథ్‌కు మజ్లీస్ మీదున్న ప్రేమ.. ప్రజల మీద లేదని విమర్శించారు. కోర్టును తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. నాదర్‌గుల్‌లో చాలా ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ఎందుకు పరిరక్షించడం లేదని ప్రశ్నించారు. అక్కడ ఎన్నో ఎకరాల భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని తెలిపారు.


వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెబుతున్న హైడ్రా.. మరి ఆ భూములను ఎక్కడ దాచిపెట్టారని.. ఎందుకు ప్రజల ముందు ఉంచడం లేదని నిలదీశారు. పరిపాలనలో లోపంతోనే అధికారులపై ఆరోపణలు వస్తున్నాయని రామచందర్‌రావు విమర్శించారు. సల్కమ్ చెరువులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కోర్టులను కూడా అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. న్యాయస్థానాల ఆదేశాలున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా చూస్తూ ఊరుకోం. క్యూర్‌పై ఆగస్ట్ 15 తర్వాత భాజపా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తాం. ఆ తర్వాత ఉద్యమాలు ఉద్ధృతం చేస్తాం. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిని రెండేళ్ల తర్వాత తప్పకుండా మారుస్తారు. ఎస్ఐఆర్ పక్రియ ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు ఉంటాయని అనుకుంటున్నాం. ఇథనాల్‌తో వాహనాల ఇంజిన్లు పాడైపోతాయని ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు అన్నారు.

# అమ్మవారి దయతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలి: విజయేందర్ రెడ్డి

## ● వెంకట సాయి నగర్ కాలనీలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**ఉప్పల్ ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** రామంతపూర్ బాగాయత్‌లోని వెంకట సాయి నగర్ కాలనీలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకట సాయి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి తొట్టెల ఊరేగింపును కాలనీలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. తొట్టెల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, డప్పుల మోత, మహిళల బోనాల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్





సభ్యులు మాట్లాడుతూ బోనాల పండుగను ప్రతి సంవత్సరం కాలనీ ప్రజలందరూ ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కాలనీలో సుఖశాంతులు, ఆరోగ్యం, సౌభాగ్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి ,గౌరవ సభ్యులు రమేష్ గౌడ్, ఎం రవికుమార్ , గోపాల్ యాదవ్ , సర్వ సత్తయ్య యాదవ్, శివ శంకర్ , సంజీవకమిటీ సభ్యులు ఆర్ గోవింద్, జి అశోక్, శ్రీనివాస్ గౌడ్ , కే నవీన్ కుమార్, భూపతి నరసింహ గౌడ్, డాక్టర్ విద్యాసాగర్, రామకృష్ణ, శివకుమార్ , బి.చలపతిరావు, రమేష్ శెట్టి, శ్రీధర్ గౌడ్, స్వామి, నరేష్, శ్రీనివాస్ రెడ్డి ,హరీష్ , శేఖర్, బి.రాములు గౌడ్, చంద్రం చారి ,పరుశు రాం, ఐలేష్ యాదవ్, చారి, హుస్సేన్, బాల కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కామర్స్ బోధనలో ప్రతిభకు పట్టం - డాక్టర్ కె. నవీన్ కుమార్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

**హైదరాబాద్ ఆగస్టు 10(పిసిడబ్ల్యూ న్యూస్):** కామర్స్ విద్యా రంగంలో బోధన, పరిశోధన, విద్యార్థుల మార్గదర్శకత్వంలో విశిష్ట సేవలు అందిస్తున్న బద్రుక కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కె. నవీన్ కుమార్ కు ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రాక్టికల్ అకౌంటెన్సీ “బెస్ట్ కామర్స్ ఫ్యాకల్టీ అవార్డు2026” లభించింది. హైదరాబాద్ రెడ్డి హిల్స్‌లో శనివారం నిర్వహించిన ఐపిఏ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లోకాయుక్త జస్టిస్ ఎ. రాజశేఖర్ రెడ్డి డా. కె. నవీన్ కుమార్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. రెండు దశాబ్దాలకు పైగా కామర్స్ విద్యా రంగంలో సేవలందిస్తున్న డా. కె.నవీన్ కుమార్ బోధనతో పాటు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, పరిశోధన,అకాడమిక్ మార్గదర్శకత్వం, అధ్యాపకుల




శిక్షణ తదితర రంగాల్లో విశేష కృషి చేస్తున్నారు. పరిశోధనా వ్యాసాల ప్రచురణ, పుస్తక రచన, జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, శిక్షణా కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యం ద్వారా కామర్స్ విద్యాభివృద్ధికి ఎన్నో సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా డా.కె.నవీన్ కుమార్ మాట్లాడుతూ, ఈ పురస్కారం తన విద్యా సేవలకు లభించిన గౌరవంగా భావిస్తున్నానని, భవిష్యత్తులో మరింత అంకితభావంతో బోధన, పరిశోధన, విద్యా సేవలను కొనసాగిస్తానని తెలిపారు. తనను ప్రోత్సహిస్తున్న బద్రుక కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి శ్రీ శ్రీ కిషన్ బద్రుక,డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ ఎస్. అభిరామ కృష్ణ, ప్రిన్సిపల్ డా. బి. మోహన్ కుమార్, సహచర అధ్యాపకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేశారు .

# కరీంనగర్‌లో ఘనంగా 12 రోజుల జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ నీ వేడుకలు

**కరీంనగర్, ఆగస్టు 10(పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్ర మిలాద్ కమిటీ కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా 12 రోజుల పాటు జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ నీ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధి అడ్వకేట్ మహమ్మద్ జమీల్ ఉద్దీన్ తెలిపారు. బాంబే స్కూల్, హుస్సేనీపురాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో కేంద్ర మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఖాలిద్ మొహియుద్దీన్ ఫరీద్ బాబా, కార్యదర్శి గులాం రబ్బానీ ఖాద్రీ, ఉపాధ్యక్షుడు సయ్యద్ హబీబుద్దీన్ హాజీ, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఆగస్టు 15న రాత్రి 9 గంటలకు పీడపల్లి రోడ్డులోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో ఘనమైన నాతియా ముషాయిరా నిర్వహించనున్నట్లు జమీల్ ఉద్దీన్ తెలిపారు. ఆగస్టు 16న బాంబే స్కూల్ హుస్సేనీపురాలో 10 నుంచి 18 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు నాత్ పోటీ నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీలో పాల్గొనేందుకు ఆగస్టు 11న క్యూఆర్ కోడ్ విడుదల చేస్తామని తెలిపారు. మొదటి, రెండో, మూడో బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేస్తామన్నారు. ఆగస్టు 18, 19, 20




తేదీల్లో సాయంత్రం బాంబే స్కూల్ హుస్సేనీపురాలో దురూద్ వ సలాం కార్యక్రమంతో పాటు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 21న కరీంనగర్ నగరంలోని 8 మసీదుల్లో ప్రముఖ ఉలమాలు ప్రత్యేక ప్రసంగాలు చేయనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 22న కరీంనగర్‌లోని పీకాక్ రెస్టారెంట్‌లో ముస్లిమేతర మేధావుల కోసం పరిచయ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్‌కు చెందిన తెలుగు వక్త మక్దూమ్ మొహియుద్దీన్ ప్రసంగిస్తారు. ఆగస్టు 23న ఉదయం 10 గంటలకు కశ్మీర్‌గడ్డలోని షాలిమార్ ఫంక్షన్ ప్యాలెస్‌లో మహిళల కోసం ప్రత్యేక మిలాద్ సమావేశం నిర్వహించనున్నారు. ఆగస్టు 24న రాత్రి 9 గంటలకు కార్ఖానాగడ్డ నాకా చౌరస్తాలో ఘనమైన జష్నే మిలాద్ సభ నిర్వహించనున్నారు. ఈ సభలో ప్రముఖ వక్త అల్లామా సుల్తాన్ అష్రఫ్ కచ్ఛోచ్వీ ముఖ్య అతిథిగా ఎ ా ల ో ్ ని ప్రసంగించనున్నారు. ఆగస్టు 25న సాయంత్రం బాంబే స్కూల్ హుస్సేనీపురాలో దురూద్ వ సలాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 26న ఉదయం 8 గంటలకు బాంబే స్కూల్ హుస్సేనీపురా నుంచి ప్రతి ఏడాది మాదిరిగా ఘనమైన కేంద్ర మిలాద్ ఊరేగింపు నిర్వహించనున్నట్లు అడ్వకేట్ జమీల్ ఉద్దీన్ తెలిపారు. అదే రోజు రాత్రి 9 గంటలకు సర్కస్ గ్రౌండ్‌లో కేంద్ర జష్నే మిలాద్ ఉన్ నబీ నీ సభ నిర్వహించనున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అల్లామా సయ్యద్ కమర్ ఉల్ హసన్ పర్యవేక్షణలో ఈ సభ జరగనుంది. కేంద్ర మిలాద్ కమిటీ కార్యదర్శి గులాం రబ్బానీ ఖాద్రీ మాట్లాడుతూ ముస్లిం సోదరులు, ప్రజలు అన్ని కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్త యస్వాడలో హైమాస్ట్ లైట్ల ప్రారంభం



## 21వ డివిజన్ కొత్త యస్వాడలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా 21వ డివిజన్ పరిధిలోని కొత్త యస్వాడ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి



డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటు వల్ల రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందడంతో పాటు భద్రత కూడా పెరుగుతుందని తెలిపారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర సౌకర్యాలను దశలవారీగా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కొత్త యస్వాడ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని ప్రాధాన్యత ఆధారంగా చేపడతామని మేయర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వరాల నర్సింగం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శిగా గుజ్జుల రవీందర్ రెడ్డి నియామకం



**కరీంనగర్ ఆగస్టు 10 2026(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా కరీంనగర్ లో ఈరోజు జాతీయ పరిరక్షణ సమితి తెలంగాణ పరిరక్షణ తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా గుజ్జుల రవీందర్ రెడ్డి నియమించడం జరిగింది. గతంలో సింగల్ విండో చైర్మన్ గా మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గా, ఉత్తమ రైతుగా, వ్యవసాయ కుటుంబం ఆదర్శంగా ఇంకా ఎన్నో అనుభవం ఉన్న గుజ్జుల రవీందర్ రెడ్డి కి ఇవ్వడం జరిగింది. నాపై నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చిన జాతి అధ్యక్షులు శ్రీనివాసరావు గారికి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బి రెడ్డి కరుణాకర్ రెడ్డి గారికి శుభాకాంక్షలు తెలుపుతూ నేను నా పదవికి తగిన న్యాయం చేస్తా రైతు సమస్యలపై ప్రజా సమస్యలపై పోరాడుతానని తెలిపారు.

# కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్ ...

## ● స్వగృహంపై జాతీయ జెండా ఎగరవేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం



**కరీంనగర్ ఆగస్టు 10(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లావ్యాప్తంగా సోమవారం రోజున ‘హర్ ఘర్ తిరంగా‘ అభియాన్ ప్రోగ్రాం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తన స్వగృహంపై కుటుంబ సభ్యుల తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూమన జాతీయ పతాకం దేశానికి , మనందరికీ గర్వకారణమని, దేశభక్తిని కలిగే విధంగా నిరంతర ప్రేరణ శక్తిని ఇస్తుందని తెలిపారు. 2022 నుండి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ‘హర్ ఘర్ తిరంగా‘ (ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆగస్టు 15స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి, ‘వికసిత భారత్‘ నిర్మాణానికి మద్దతుగా నిలిచి, మనందరి ఐక్యతను చాటి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదిన కర్మలో మాజీ ఎమ్మెల్యే సండ్ర

## - చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి



**సత్తుపల్లి, ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్)** : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ పెద్ది సుదర్శన్‌రెడ్డి అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ ఉద్యమ సహచరులకు, ఆయన అభిమానులకు తీరని లోటని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ, పార్టీ బలోపేతానికి పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పెద్ది సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య గుర్తు చేసుకున్నారు. ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను స్మరించుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా బెల్లం వేణు, టీ న్యూస్ రిపోర్టర్ సాంబ తదితరులు పాల్గొని స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్‌లు కూడా ఇవ్వాల్సిందే..!

## - బీజేపీ మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి



**కరీంనగర్ ఆగస్టు 10(పీసీడబ్ల్యూ న్యూస్):** అధికారంలోకి వచ్చేముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలలో భాగంగా వృద్దాప్య మరియు బీడీ కార్మికులకు కూడా ఇవ్వాల్సిందేనని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల బీజేపీ మాజీ అధ్యక్షులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి సోమవారం నాటి పత్రికా ప్రకటన లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన 100 రోజుల్లో గత ప్రభుత్వం ఇచ్చినటువంటి వివిధ రకాల పెన్షన్ లను పెంచి ఇస్తామని చెప్పి రెండున్నరేళ్ళుగా మభ్యపెడుతూ చివరికి పెంపు చేయకుండా, వృద్దాప్య మరియు బీడీ కార్మికుల పెన్షన్ లపై స్పష్టత ఇవ్వకపోవడం మోసపోరితమేనని అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం పెన్షన్ లకోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ కు వెళ్లిన వృద్దులకు, బీడీ కార్మికులకు సంబందించి సైట్ లో అప్షన్ కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ లో కూడా వృద్దాప్య మరియు బీడీ కార్మికుల వివరాల నమోదు గురించి కాలం లేదని పేర్కొన్నారు. ఈ రెండు రకాల పెన్షన్ లపై దరఖాస్తు లు తీసుకుంటున్నారా లేదా సైట్ లో పొందుపరిచే విషయంలో సాంకేతిక పొరపాటు ఏమైనా జరిగిందా అనే విషయంపై స్పష్టంగా తెలపాలని, అలాగే,ఈ ఆగస్టు 15 న ఇస్తామంటున్నటువంటి పెన్షన్ లు పెంచే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# అరుణోదయ విమలక్క 50 ఏళ్ల సమరగానం

**- తెలంగాణ నేలపై 50 గంటల ప్రజా కళల జాతర!**

**- ఉద్యమ తుఫానుకు యాభై ఏళ్ల రూపు.. ఆట, పాట, మాటల కలబోతగా సాంస్కృతిక పండుగ**

**- 50 గంటల సాంస్కృతిక పండుగకు ప్రజా కళాకారులు స్వచ్ఛందంగా తరలిరావాలి**

**- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షులు విమలక్క, రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, స్పర్శ సామాజిక అధ్యయన వేదిక అధ్యక్షులు కాకి భాస్కర్**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ నేల కన్న వీర పుత్రిక, అరుణోదయ విమలక్క ప్రజా సాంస్కృతికోద్యమంలో అలుపెరగక సాగిస్తున్న ప్రస్థానం అర్ధ శతాబ్దికి చేరుకుంది. విప్లవ పోరాటాలే ఊపిరిగా, జానపద కళారూపాలే ఆయుధాలుగా ఐదు పదుల కాలంగా ప్రజా గొంతుకై మోగుతున్న విమలక్క కళా ప్రయాణాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో 2026 సెప్టెంబర్ 26 ఉదయం 10 గంటల నుండి సెప్టెంబర్ 28 మధ్యాహ్నం 12 గంటల వరకు వరుసగా 50 గంటల పాటు ఏకధాటిగా "ప్రజా కళా జాతర" ను ఘనంగా నిర్వహించనున్నామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల గౌరవాధ్యక్షులు విమలక్క, రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, స్పర్శ సామాజిక అధ్యయన వేదిక అధ్యక్షులు కాకి భాస్కర్ లు మాట్లాడారు. విప్లవోద్యమాల నుండే విప్లవకారులు పుడతారన్నారు. ప్రజా ఉద్యమాల నుండి ప్రజా కళాకారులు ఉద్భవిస్తారన్నారు. విమలక్క జీవితకాలం విప్లవ ప్రజా సంస్కృతిక ఉద్యమాలలో 50 ఏళ్ల మైలురాయిని అధిగమించిన ప్రస్థానంలో 50 గంటల పాటు ఏకధాటిగా ఆట,పాట, మాటలతో 'ప్రజాకళ జాతర'ను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. **ఒకే గొంతు వెనుక యాభై ఏళ్ల పోరాట చరిత్ర** విప్లవోద్యమాల నుండి రూపుదిద్దుకున్న ప్రజా కళాకారిణిగా విమలక్క జీవితం ఒక నిరంతర చైతన్య స్రవంతి. తెలంగాణ సాయుధ పోరాట వీరుడైన తండ్రి కామ్రేడ్ బండ్రు నర్సింహులు పోరాట వారసత్వాన్ని, తల్లి నరసమ్మ కాయకష్టాన్ని, ఆత్మీయతను చిన్నతనంలోనే పునికిపుచ్చుకున్నారు. 1974లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆవిర్భవించినప్పటి నుండి బాల గాయనిగా ప్రజా వేదికలపై పాటల ప్రయాణం ప్రారంభించారు. ఎమర్జెన్సీ కాలంలో జైల్లో ఉన్న తండ్రిని చూడడానికి వెళ్లినప్పుడే ఆమె గొంతులోని ప్రజాగ్నిని వరవరరావు, హెచ్‌ఆర్‌కే, కాశీపతి వంటి ఉద్యమ దిగ్గజాలు గుర్తుపట్టారు. పాటను కేవలం ఒక వినోదంగా కాకుండా, సామాజిక మార్పుకు ఆయుధంగా మలచడంలో విమలక్క విజయం సాధించారు. నాట్లలో సాగే జానపదం నుండి ఒగ్గు కథలు, భూమి బాగోతం, పీరీల పాటలు, బతుకమ్మ ఆటలు, డప్పు దరువులు, కోయ-గోండు నృత్యాల వరకు తెలంగాణ సమాజంలో పెనవేసుకుపోయిన ప్రతీ కళారూపానికి విప్లవ తత్వాన్ని జోడించారు. పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ వంటి ప్రజా సంఘాల వేదికగా మహిళా విముక్తి, ప్రజల హక్కుల కోసం నడుంకట్టి పోరాట మైదానాల్లో తన గళాన్ని వినిపించారు. **జానపద సంస్కృతి పునరుజ్జీవం.. ప్రత్యామ్నాయ ప్రజా సాంస్కృతిక నిర్మాణంలో భాగస్వామ్యం** ఈ 50 గంటల మహా జాతర కేవలం పాటల వేడుక మాత్రమే కాదు, మనువాద, సామ్రాజ్యవాద సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజా సంస్కృతిని పునర్నిర్మించే బృహత్ ప్రయత్నం. ఇందులో 50 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో పాడిన విప్లవ పాటలు, సామాజిక, పర్యావరణ, కుల వ్యతిరేక, స్త్రీ విముక్తి, ఆదివాసీ స్వయం పాలన గీతాల అలలు ఎగసిపడనున్నాయి. అలాగే 50 మంది ఉపన్యాసకుల లోతైన విశ్లేషణలు, 50 అనుభవాల మేళవింపుతో పాటు బుర్రకథలు, బ్యాలేలు, నాటికల ప్రదర్శనలు నిరంతరాయంగా సాగుతాయి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, జార్ఖండ్, ఒడిశా వంటి అనేక ఉద్యమ ప్రాంతాలతో పాటు విదేశాల్లోనూ బహుజన బతుకమ్మ సందేశాన్ని వ్యాప్తి చేసిన విమలక్క సమిష్టి శక్తే ఈ కార్యక్రమానికి మూలాధారం. తెలుగు నేల నలుమూలల నుండి విచ్చేసే కవులు, జానపద కళాకారులు, ఆదివాసీ, వృత్తి కళాకారులు, కళా విమర్శకులు, ప్రజాస్వామికవాదులు ఈ మహా జాతరలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు. ఈ చారిత్రాత్మక వేడుక ఆద్యంతం చిత్రీకరించబడుతున్నందున, ప్రదర్శనలలో పాల్గొనదలచిన కళాకారులు ముందుగా పేర్లు నమోదు చేసుకుని సమన్వయానికి సహకరించాలని కోరారు. అంతరిస్తున్న జానపద సంపదను కాపాడుకుంటూ, భావి తరాలకు ఉద్యమ స్ఫూర్తిని అందించడానికి ఈ 50 గంటల సంస్కృతిక పండుగకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, ఉపాధ్యక్షురాలు అనిత, సహాయ కార్యదర్శి రాకేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు లలిత, రామన్న, బుల్లెట్ వెంకన్న, సౌమ్య, అరుంధతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

---

## హుజురాబాద్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' అభియాన్.. స్వగృహంపై జాతీయ జెండా ఎగురవేసిన గంగాడి కృష్ణారెడ్డి



**హుజురాబాద్ ఆగస్టు 10(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆగస్టు 15 దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కార్యక్రమంలో భాగంగా, సోమవారం రోజున బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి హుజురాబాద్‌లోని తన స్వగృహంపై జాతీయ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 2022 సంవత్సరం నుండి 'హర్ ఘర్ తిరంగా' యాత్ర అత్యంత వైభవంగా కొనసాగుతోందని గుర్తుచేశారు. ప్రజలందరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి, దేశంపై తమకున్న దేశభక్తిభావాన్ని చాటిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ ఐక్యతకు ప్రతీక తిరంగా కార్యక్రమాలు దేశ ఐక్యతను మరింత పటిష్టం చేయడానికి, నేటి యువతలో దేశభక్తి భావాలను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, భావితరాలకు దేశభక్తి విలువలను అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా పాలుపంచుకుని జాతీయ జెండాకు వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తూర్పాటిరాజు జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్ 23వ వార్డుకౌన్సిలర్ లక్ష్మీదుర్గ 25 వ వార్డ్ కౌన్సిలర్ కొండ ప్రశాంతి పట్టణ మాజీ అధ్యక్షులు గంగిశెట్టిరాజు సెంట్రల్ ఫిలిం బోర్డు మెంబర్ సబ్బనిరమేష్, యాంసాని శశిధర్ నరాలరాజశేఖర్ మంచికట్లమురళి పోతులసంజీవ్ గుర్రంసంతోష్ కోడిమ్యాలపవన్ తూర్పాటి రామచంద్రం దాసరివీరయ్య,తూర్పాటి రాజశకర్, భూతం సాయిరాం,పర్థం విజయ్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఇంటిపై జాతీయ పతాకం ఆవిష్కరించిన మేయర్ కొలగాని శ్రీనివాస్..



**కరీంనగర్ ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈరోజు తన నివాసంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించినట్లు కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కేవలం ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం మాత్రమే కాదని, దేశభక్తి భావనను ప్రతి ఇంటికి, ప్రతి కుటుంబానికి చేరవేసే మహత్తర జాతీయ ఉద్యమమని పేర్కొన్నారు. భారత జాతీయ పతాకం మన ఐక్యతకు, సమైక్యతకు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడి గౌరవానికి, దేశ సార్వభౌమాధికారానికి, రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. యువతలో దేశభక్తి, జాతీయ గౌరవం, రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం చేసిన త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలనే స్ఫూర్తిని ఈ కార్యక్రమం కలిగిస్తుందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రతి పౌరుడు తన ఇంటిపై గర్వంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, దేశభక్తిని చాటాలని మేయర్ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమం ఈ నెల 10 నుండి 14వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో నగరంలోని ప్రతి కుటుంబం ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన నగర ప్రజలను కోరారు. భారతదేశ ఐక్యత, సమైక్యత, అఖండతను ప్రపంచానికి చాటిచెప్పే ఈ జాతీయ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని జాతీయ పతాకానికి గౌరవం తెలపాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

---

# కరీంనగర్ అభివృద్ధికి టెక్నాలజీ తోడు

**రోడ్డు పనుల్లో వేగం, నాణ్యత కోసం AJAX కాంక్రీట్ యంత్రం**

**35వ డివిజన్‌లో అత్యాధునిక యంత్రంతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన మేయర్ కొలగాని శ్రీనివాస్**





**కరీంనగర్ ఆగస్టు 10(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తూ, నాణ్యతా ప్రమాణాలను పెంచే దిశగా నగర పాలక సంస్థ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 35వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అత్యాధునిక ాాజీూాశ సెల్ఫ్ లోడింగ్ కాంక్రీట్ మిక్సర్ యంత్రాన్ని వినియోగిస్తూ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ పనులను ప్రారంభించారు. సంప్రదాయ పద్ధతులతో పోలిస్తే AJAX యంత్రం ద్వారా కాంక్రీట్ తయారీ, మిశ్రమ నిష్పత్తుల నియంత్రణ, నిర్మాణ ప్రాంతంలోనే కాంక్రీట్ సిద్ధం చేయడం, వేగవంతమైన సరఫరా వంటి ప్రయోజనాలు లభిస్తాయి. దీని వల్ల పనుల అమలు సమయం తగ్గడంతో పాటు నిర్మాణ నాణ్యత కూడా మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, "అభివృద్ధి పనులు ప్రారంభించడం మాత్రమే కాదు, వాటిని నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అత్యంత ముఖ్యమైన విషయం. అందుకే ఆధునిక యంత్ర సాంకేతికతను వినియోగిస్తూ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నాం" అని తెలిపారు.ద **వేగం పెరగాలి నాణ్యత తగ్గకూడదు** రోడ్డు నిర్మాణ పనుల్లో వేగంతో పాటు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని మేయర్ స్పష్టం చేశారు. కాంక్రీట్ నాణ్యత, సరైన మిశ్రమ నిష్పత్తులు, రోడ్డు మందం, క్యూరింగ్ వంటి అన్ని అంశాల్లో ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నగరంలో రోడ్డు పనులు ఎక్కువ కాలం కొనసాగడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటారని, అందువల్ల ఆధునిక యంత్రాల సహాయంతో సాధ్యమైనంత తక్కువ సమయంలో పనులను పూర్తి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. **35వ డివిజన్‌తో ప్రారంభం నగరవ్యాప్తంగా విస్తరణ** 35వ డివిజన్‌లో ప్రారంభించిన ఈ విధానాన్ని పరిశీలించి, అవసరాన్ని బట్టి నగరంలోని ఇతర డివిజన్లలో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీలు మరియు ఇతర కాంక్రీట్ నిర్మాణ పనుల్లో కూడా ఆధునిక యంత్ర సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ తెలిపారు. "కరీంనగర్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం. అందుకు అనుగుణంగా మన పని విధానాలు కూడా మారాలి. పాత పద్ధతులకు పరిమితం కాకుండా ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజలకు మెరుగైన రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు అందించడమే మా లక్ష్యం"లి అని ఆయన పేర్కొన్నారు. నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని, ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడే శాశ్వత అభివృద్ధి పనులుగా కనిపించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. **అభివృద్ధికి ఆధునిక సాంకేతికత కొత్త వేగం** AJAX వంటి ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా మానవ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పనుల అమలులో వేగం పెంచడం, కాంక్రీట్ సరఫరాలో సమయాన్ని ఆదా చేయడం, నిర్మాణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించడం సాధ్యమవుతుందని మేయర్ తెలిపారు. "అభివృద్ధిలో ఆలస్యానికి తావులేదు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని కరీంనగర్‌ను మెరుగైన మౌలిక వసతులతో కూడిన ఆధునిక నగరంగా తీర్చిదిద్దుతాం. 35వ డివిజన్‌లో ప్రారంభమైన ఈ విధానం నగర అభివృద్ధి పనుల్లో కొత్త వేగానికి నాంది కావాలి"లి అని మేయర్ కొలగాని శ్రీనివాస్ పేర్కొన్నారు. 35వ డివిజన్ కార్పొరేటర్ సాధవిని సుజాత శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కలిసిన బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం



**కరీంనగర్ ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** బిజెపి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సాయిని మల్లేశం మొదటిసారిగా కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సాయిని మల్లేశం ని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారుజిల్లాలో పార్టీ బలోపేతానికి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా బండి సంజయ్ సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు,కార్పొరేటర్లు: ఎన్నం లక్ష్మీ ప్రకాష్, గాజ రమ శివరాం, కర్రే పద్మ అనిల్, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, గుంజేటి శివ, గాధగోని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాత్కాలిక రోడ్డు మరమ్మతులు..




**రామడుగు, ఆగస్టు 10(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా రామడుగు మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు పై గుంతల సమస్యలు వలన వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో రామడుగు గ్రామ పంచాయతీ పాలకవర్గం సర్పంచ్ మహమ్మద్ మొయిజ్ ఉప సర్పంచ్ పెందోటా రాజు పాలకవర్గం వార్డు సభ్యులు అందరూ కలిసి గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు పై గుంతలను కంకర, సిమెంట్ మిశ్రమాలతో తాత్కాలిక మరమత్తులు (ప్యాచ్ వర్క్)చెపించడం జరిగింది. ఈ మరమ్మత్తుల వలన వాహనదారులు ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహమ్మద్ మొహీజ్ ఉప సర్పంచ్ పెందోట రాజు పాలకవర్గం వార్డు సభ్యులు మామిడి దిలీప్ కుమార్,కర్నె శ్రీలత - శ్రీనివాస్, ఎండి ఆరీఫ్,చంద అనిల్,సామంతుల సుజాత - తిరుపతి, మామిడి శ్రావణ్,సిరికొండ పల్లవి - సాయితేజ, మ్యాడారం అర్చన - అనిల్,నీలం అరుణ - లక్ష్మణ్,రాగం స్వప్న - రవి,కారుపాకల నరేష్,మామిడి కుమార్, సిరిగిరి వెంకటేశం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు

**- అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్.వి. మహేందర్ కుమార్**





**హైదరాబాద్, ఆగస్టు 10(పిసిడబ్ల్యు న్యూస్):** గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.వి. మహేందర్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఆలయ పరిసరాల్లో భక్తుల రాకతో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో సి.కే. మూర్తి, నరేందర్ యాదవ్, శేఖర్ చారి, రవీందర్ రెడ్డి, గుజ్జ నవీన్, జగదీష్ గుప్తా తదితరులు పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

# ఎమ్మెల్యే రాగమయికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు



**సత్తుపల్లి, ఆగస్టు 10 (పిసిడబ్ల్యు న్యూస్) :** సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. కల్లూరు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దబోయిన శ్రీనివాసరావు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పెద్దబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు. ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులను అలంకరించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే రాగమయి దయానంద్ నాయకత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో రాజబోయన శ్రీనివాసరావు, సాంబ తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఉద్యమ త్యాగధనులకు న్యాయం చేయండి!

**- డాక్టర్ పిడమర్తి రవి, డాక్టర్ కె వి కృష్ణారావు**

**- లక్ష మంది పోరాట యోధులకు అండగా నిలిస్తేనే తిరుగులేని ప్రజామోదం**

**- పాలకుల పక్షపాతాల్ని ప్రశ్నిస్తూ బిగ్గరగా మోగనున్న ఉద్యమ స్వరాలు!**



**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 10 (పిసిడబ్ల్యు న్యూస్) :** తెలంగాణ గడ్డ కోసం, స్వరాష్ట్ర కల నెరవేర్చడం కోసం నాడు గుండెలను అడ్డంగా పెట్టి.. లాఠీ దెబ్బలకు, జైలు జీవితాలకు, కేసులకు ఎదురొడ్డి నిలిచిన త్యాగధనుల ఆక్రందనలకు ఎప్పుడు విముక్తి కలుగుతుంది? రెండు తరాల ఉద్యమకారుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో, వారి ఆశయాలను గౌరవించాల్సిన బాధ్యత పాలక వర్గాలపై లేదా? అంటూ తెలంగాణ ఉద్యమనేతలు తెగించి ప్రశ్నించారు.? తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను ఏమాత్రం ఆలస్యం చేయకుండా అత్యంత వేగవంతం చేయాలని, రెండు తరాల్లో సుమారు లక్ష మంది తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి, ఉద్యమ నాయకులు డాక్టర్ కె.వి. కృష్ణారావు డిమాండ్ చేశారు. స్థానిక చిన్నారి హాస్పిటల్ డైరెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో "రెండు తరాల తెలంగాణ ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనం" కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి, డాక్టర్ కెవి కృష్ణారావు లు మాట్లాడుతూ.. 1969 నాటి తొలితరం పోరాట యోధులు, 2009 నాటి మలితరం విద్యార్థి, ప్రజా ఉద్యమకారులను కలుపుకొని రాష్ట్రంలో అర్హులైన లక్ష మందిని తక్షణమే ప్రభుత్వ పరంగా గుర్తించాలి. 250 చదరపు గజాల చొప్పున సర్వం కోల్పోయి వీధిన పడిన ఉద్యమ కారుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి. ప్రతి ఉద్యమకారునికి నెలకు గౌరవప్రదమైన పింఛన్ సదుపాయంతో పాటు అధికారిక గుర్తింపు కార్డులు అందజేయాలి. లాఠీ దెబ్బలు తిని ఆనారోగ్యం పాలైన వారు, జైలు జీవితం గడిపిన వారు, ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలను మానవీయ కోణంలో ఆదుకోవాలి. **"న్యాయం చేయండి.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుంటాం!"** నాడు ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ జెండా పట్టిన యోధులకు న్యాయం జరిగితేనే, ప్రజాస్వామిక తెలంగాణలో ప్రజా ప్రభుత్వానికి అసలైన ప్రాణవాయువు లభిస్తుందన్నారు. "ఉద్యమకారులకు సమన్యాయం చేయండి.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చే బాధ్యత ఉద్యమకారులే భుజాన ఎత్తుకుంటారు" అని స్పష్టం చేశారు. **సెప్టెంబర్ 16న 'ఓయూ' వేదికగా కదంతొక్కనున్న పోరాట సైన్యం!** రాబోయే సెప్టెంబర్ 16న హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించబోయే "రెండు తరాల తెలంగాణ ఉద్యమకారుల అపూర్వ సమ్మేళనానికి" 1969 అండ్ 2009 ఉద్యమకారులు, అమరుల కుటుంబాలు, ప్రజాసంఘాల నాయకులు వేలాదిగా తరలివచ్చి ఉద్యమ హక్కుల పోరాటాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమ నేతలు దేవిరెడ్డి విజయ్, మట్టే గురుమూర్తి, జిల్లా విజయ్, రాకేష్, భూక్య హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్‌ను బలోపేతం చేయాలి

**● సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లి**







**కరీంనగర్ ఆగస్టు 10 (పిసి డబ్ల్యూ న్యూస్):** గ్రామస్థాయిలో ఎస్సీ సెల్ ను బలోపేతం చేయాలని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సెంట్రల్ గార్డెన్స్ లోగల టీఎన్జీవో హాల్లో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్‌ను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికిఅనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఎస్సీ సెల్ నాయకులు కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఎస్సీ సెల్ కమిటీలను మరింత చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేట్ డాక్టర్ సిద్ధార్థ్ హితాంబ్రే తోపాటు ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్, జిల్లా నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు డాక్టర్ కవ్వంపల్లి కి ఘన స్వాగతం లభించింది. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కొమరం భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సమావేశ స్థలి వరకు ర్యాలీ నిర్వహించారు.

# రాష్ట్రపతి ఉత్తర్వులు మతస్వేచ్ఛకు గొడ్డలిపెట్టు నగరంలో భారీ నిరసన ర్యాలీ

**దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి: బిషప్ విజయ్ పాల్**





**హనుమకొండ,ఆగస్టు 10 (పిసి డబ్ల్యూ న్యూస్):** దళిత క్రైస్తవుల మత స్వేచ్ఛకు 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల్లోని పారా 3 గొడ్డలిపెట్టుగా మారిందని, వెంటనే ఆ పారా 3ని సవరించి క్రైస్తవ మతాన్ని స్వీకరించిన దళితులను ఎస్సీలుగా గుర్తించాలని వరంగల్ క్యాథలిక్ బిషప్ విజయపాల్ డిమాండ్ చేశారు. సోమవారం హన్మకొండ సిబిసి చర్చి ప్రాంగణంలో భారీ శాంతి నిరసన ర్యాలీని బిషప్ విజయ్ పాల్ ప్రారంభించారు. యునైటెడ్ వరంగల్ చర్చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన ర్యాలీకి ముందు బిషప్ మాట్లాడుతూ ఇతర మతాలను స్వీకరించిన దళితులకు ఎస్సీ హోదాను కొనసాగించిన కేంద్ర ప్రభుత్వం దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే మాత్రం ఎస్సీ హోదా వర్తించదని చెప్పడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం దేశ పౌరులకు మత స్వేచ్ఛను ఇచ్చిందని, ఏ పౌరుడైనా ఏదైనా మతాన్ని స్వీకరించవచ్చని పేర్కొందని, అలాంటప్పుడు దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే ఎస్సీ హోదాను తొలగించడం ఎలా న్యాయమవుతుందని ప్రశ్నించారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులోని పారా 3 దళిత క్రైస్తవుల మత స్వేచ్ఛను అడ్డుకుంటుందన్నారు. గత 76 ఏండ్లుగా దళిత క్రిష్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ సిబిసిఐతోపాటు అన్ని క్రైస్తవ సంఘాలు జాతీయస్థాయిలో ఉ ద్యమిస్తున్నాయన్నారు. సిక్కు, బౌద్ధ మతాన్ని స్వీకరించిన దళితులకు కూడా గతంలో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ హోదాను రద్దు చేసి, అనేక పోరాటాల నేపథ్యంలో వారికి ఎస్సీ హోదాను కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో క్రైస్తవ మిషనరీలు దళిత, గిరిజన పేద వర్గాల కోసం అనేక మౌళిక వసతులను కల్పించారని, ఇప్పుడు ఎఫ్సిఆర్ఎ సవరణల బిల్లును పార్లమెంటులో పెట్టి ఆయా వర్గాలకు ఆర్థిక ప్రయోజనాలు కలుగకుండా చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ విషయంలో క్రైస్తవ సంస్థలు తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలియచేయడం జరిగిందన్నారు. ఈ ర్యాలీని విజయవంతం చేయడానికి వచ్చిన అన్ని క్రైస్తవ సంఘాలకు, విశ్వాసులకు బిషప్ అభినందనలు తెలిపారు. **దళిత క్రైస్తవులకు మత స్వేచ్ఛ వద్దా..? పాస్టర్ కురియన్** దళిత క్రైస్తవులకు మాత్రమే మత స్వేచ్ఛను అడ్డుకోవడమేంటని ట్రైసిటీ క్రిష్టియన్ ఫెలోషిప్ (టిసిఎఫ్) అధ్యక్షులు పాస్టర్ కురియన్ ప్రశ్నించారు. సిక్కు, బౌద్ధ మతాలను స్వీకరించిన దళితులకు ఒక న్యాయం, క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు ఒక న్యాయమా ? ఇది ముమ్మాటికి దళిత క్రైస్తవుల మత స్వేచ్ఛను హరించడమేనన్నారు. దళిత క్రైస్తవుల దశాబ్దాల పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. **రంగనాథ్ మిశ్రా సిఫారసులను అమలు చేయాలి: బిషప్ ఐజాక్** క్రైస్తవ మతాన్ని స్వీకరించిన దళితుల స్థితిగతులు, ఆర్థిక పరిస్థితుల్లో ఎలాంటి మెరుగుదల లేదని, సామాజిక వివక్ష కొనసాగుతున్నందునా దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని రంగనాథ్ మిశ్రా కమిషన్ చేసిన సిఫారసులను వెంటనే అమలు చేయాలని టిసిఎఫ్ ఛైర్మెన్ బిషప్ దామెర ఐజాక్ డిమాండ్ చేశారు. హన్మకొండ అంబేద్కర్ విగ్రహానికి పాస్టర్లు, సంఘ పెద్దలు పూలమాలలు వేశారు. అనంతరం వరంగల్ కలెక్టరేట్లో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణికి క్రైస్తవ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. హన్మకొండ కలెక్టరేట్లో డిఆర్డిఓ మేన శ్రీనుకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ నిరసన ర్యాలీలో వరంగల్ డయసీస్ ఎస్సీ కమిషన్ సెక్రటరీ ఫాదర్ మాచర్ల నవీన్, ఫాదర్ నమిండ్ల సురేందర్, వరంగల్ సిబిసి చర్చి పాస్టర్ పుల్ల బాజ్జీ, జన్ను పరంజ్యోతి, ఎంపి ఆనంద్ మోజెస్, మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, పులి అనిల్కుమార్, పాస్టర్ మార్టిన్ లూథర్, హర్మోన్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రాము, పాస్టర్ అశోక్ పాల్, వడ్డేపల్లి సీయోను ప్రార్థనా మందిరం పాస్టర్ దేవరాజ్, సిబిసి హన్మకొండ చర్చి అధ్యక్షులు క్రిష్టఫర్ రూబెన్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి విజయ్స్వరూప్, వరంగల్ సిబిసి చర్చి అధ్యక్షులు పోలెపాక మనోహర్, రుద్రారపు రాజ్మాహ్రావు, నల్లా జాన్సన్ ప్రసాద్, జన్ను ఈర్మియా, ఎస్సీ కమిషన్ సభ్యులు ల్యాదెళ్ల జాన్సన్, మేరీ సునీత, కలపాల ప్రవీణ్, కమలేశ్, తంగిరాల పాల్ పాల్గొన్నారు.

# పెనుబల్లిలో జైల్ బరో సక్సెస్








**పెనుబల్లి, ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కార్మిక రైతు వ్యవసాయ కూలీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా స్ఫూర్తితో వి.ఎం బంజర్ రింగ్ సెంటర్ లో నిర్వహించిన జైలు భరో కార్యక్రమం సక్సెస్ అయిందని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు అన్నారు. వియం బంజర్ అంబేద్కర్ సెంటర్ నుండి సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘాల ఆధ్వర్యంలో వందలాదిమంది ప్రజలతో ర్యాలీ నిర్వహిస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని, విద్యుత్ సంస్కరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని విద్యుత్తును ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని కోరారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, ఇవి బిజీ రాంజీ చట్టాన్ని రద్దు చేసి గతంలో ఉన్న చట్టాన్ని అమలు చేయాలని ప్రతి కార్మికుడికి 200 రోజులు పని కల్పించాలని రోజుకూలి 700 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వంను కోరారు. ప్రశాంతంగా ప్రదర్శన సాగుతున్న, పోలీసు వారు అరెస్టు చేయటం జరిగింది అని అన్నారు. గాంధీ సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకు సుమారు 250 మంది కార్మికులు, ప్రజలను స్టేషన్కు తీసుకువెళ్లి, పూసి కత్తు పై విడుదల చేయడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరపతి రావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చిట్టి మొదల కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చెమట విశ్వనాథం, సిఐటియు మండల కన్వీనర్ గుడిమెట్ల బాబు, మహిళా సంఘం మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి, ప్రజానాట్యమండలి డివిజన్ అధ్యక్షులు కంటే సత్యం, హమాలీ యూనియన్ నాయకులు మిద్దె స్వామి, అన్నపరెడ్డి లక్ష్మయ్య, గుజ్జ వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్య క్షుడు భూక్య ప్రసాద్, రైతు సంఘం నాయకులు చలమాల నరసింహారావు, సిఐటియు నాయకులు రవీంద్ర, గుంటూరు వెంకటేశ్వరరావు, శ్రీను, జొన్నలగడ్డ రమణయ్య, వ్యవసాయ కానివి సంఘం నాయకులు రాజనేని మంగమ్మ, వడ్డెక బజారు, చిలక రమణ, నల్లబోతుల భారతి, పాల్గొన్నారు.

# సంపాదకీయం

## జార్ఖండ్ ఆందోళనపై దృష్టి సారించాలి !



పరీక్ష ఏదైనా లీకులు సర్వ సాధారణం అవుతున్నాయి. పరీక్షలు రాసిన విద్యార్థులు నష్టపోతున్నారు. ఏడాదంతా కష్టపడి పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటోంది. కొందరు దగుల్బాజీలు కాసులకు కక్కుర్తి పడడంతో ఉజ్వల జీవితాన్ని విద్యార్థులు కోల్పోతున్నారు. మొన్నటి వరకు నీట్ గొడవ ముగిసిం దనుకుంటే.. ఇప్పుడు జార్ఖండ గొడవ మొదలయ్యింది. ఇక్కడ ఉన్నది ఇండియా కూటమి ప్రభుత్వమే. సిఎం హేమంత్ సోరేన్ ప్రభుత్వం కూడా ఇందుకు బాధ్యత వహించాలి. అలాగే రాహుల్ కూడా దీనిపై సమాధానం చెప్పాలి. కేంద్రంలో హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని అంటున్న రాహుల్ ముందు జార్థం÷–డ్ వెళ్లి అక్కడి విద్యార్థులకు సమాధానం చెబితే బాగుండేది. పరీక్షలు ఏవైనా, ఎక్కడ లీకైనా పాలకులు బాధ్యత వహించాల్సిందే. కేంద్రంలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనీమా చేసిన తరవాత, పరీక్షల సంస్కరణలకు ఎన్‌డిఎ సర్కార్ నడుం బిగించింది. నందన్ నీలేకన్ నేతృత్వంలొ నిపుణుల కమిటీని వేసింది. లీకేజ్ వీరులపై చర్యలు తీసుకునేలా చట్టం తెచ్చింది. పదికోట్ల వరకు జరిమానా, పదేళ్ల వరకు జైలు శిక్ష విధించనున్నారు. ఇప్పుడు దీనిని ఉపయోగించి జార్ఖండ్ దోషులపై తొలి చర్యకు ఉపక్రమించాలి. ఇందుకోసం రాహుల్ కూడా పట్టుబట్టాలి. కేవలం అమిత్ షా రాజీనామా చేయాలన్న రాజకీయ డిమాండ్‌తో పార్లమెంట్‌ను అడ్డుకుంటూ విలువైన ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారు. పార్లమెంట్ నడవకుండా చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రం చర్యలు తీసుకున్నందున, ఇక జార్ఖండ్‌పై రాహుల్ దృష్టిసారిస్తే మంచిది. మరోవైపు జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర సిఐడి నమోదు చేసిన కేసు ఆధారంగా గత వారం ఇది ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ప్రభుత్వం నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిఐడి, ఇడి దర్యాప్తులకు అంగీకరించింది. విద్యార్థులతో జరిగిన సమావేశం అనంతరం మంత్రి సుదివ్య కుమార్ సోను మాట్లాడుతూ.. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లలో దాదాపు 98 శాతం అంశాలను ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. 2023, 2025 సంవత్సరాలకు సంబంధించిన బ్యాక్‌లాగ్ నియామక పరీక్షలతో పాటు 14వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షను రద్దు చేయడానికి ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. అయితే సర్వీస్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షను రద్దు చేయడం, అలాగే నియామక పరీక్షల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించలేదు. మంత్రి సుదివ్య కుమార్ సోను ప్రకారం.. సిజిఎల్ పరీక్షను రద్దు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏకపక్షంగా అంగీకరించలేదని తెలిపారు. ఈ పరీక్ష హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల పరిధిలో నిర్వహించబడినందున, ప్రభుత్వం స్వయంగా దానిని రద్దు చేయలేదని వివరించారు. అయితే ప్రభుత్వం తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించిందన్న వాదనను నిరసన చేస్తున్న విద్యార్థులు తిరస్కరించారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రతిపాదనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం 'విధానసభ ఘెరావ్' నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తమ ప్రధాన డిమాండ్ అయిన సిబిఐ దర్యాప్తును ప్రభుత్వం అంగీకరించలేదని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్ల లో 98 శాతం నెరవేర్చామని ప్రభుత్వం చెప్పడం వాస్తవానికి విరుద్ధమని వారు ఆరోపించారు. 13 పరీక్షలను రద్దు చేయాలని తాము డిమాండ్ చేయగా, ప్రభుత్వం కేవలం మూడు పరీక్షలను మాత్రమే రద్దు చేసిందని ఓ విద్యార్థి నాయకుడు పేర్కొన్నారు. అవకతవకలపై కేవలం సిఐడి దర్యాప్తుపైనే ఆధారపడటాన్ని కూడా విద్యార్థి నాయకులు విమర్శించారు. గతంలో సిఐఇడిపై పలు విషయాల్లో 'కప్పిపుచ్చే ప్రయత్నాలు' చేసిందనే ఆరోపణలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. నియామక పరీక్షల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై నిజాలను వెలుగులోకి తీసుకురావడానికి, బాధ్యులను గుర్తించడానికి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ అవసరమని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లను శాంతి యుతంగా వివరించాలని విద్యార్థి నాయకులు సూచించారు. సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకల ఆరోపణలపై ఇడి రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు ప్రభుత్వం ఇడి, సిఐడి దర్యాప్తులకు అంగీకరించగా, మరోవైపు విద్యార్థులు మాత్రం సిబిఐ వంటి స్వతంత్ర దర్యాప్తు కోరుతూ తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అవకతవకు కారకులైన వారిని ఊచలు లెక్క బెట్టేలా చేయాలి. అప్పుడే వారికి న్యాయం జరుగతుంది. అలాగే ఇతరులకు తగిన గుణపాఠం కలిగేలా కొత్త చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలి.




# మెడికో ప్రియాంక డెడ్‌బాడీకి పోస్ట్‌మార్టమ్ పూర్తి

**• భౌతిక కాయాన్ని స్వగ్రామం తరలింపు • తల్లిదండ్రులను పరామర్శించిన మంత్రి వాకిటి శ్రీహరి • అండగా ఉంటామన్న రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**హైదరాబాద్,ఆగస్ట్10:** మెడికో ప్రియాంక మృతదేహానికి గాంధీ దవాఖానలో పోస్టుమార్టం పూర్తయింది. ప్రియాంక అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏపీలోని రాజమహేంద్రవరంలో ఈనెల 3న దుండగులు మద్యం మత్తులో కారుతో ఢీకొట్టిన ఘటనలో గాయపడిన మెడికో ప్రియాంక ఆదివారం మధ్యాహ్నం మృతి చెందింది. బ్రెయిన్‌డెడ్‌తో ఆమె మృతిచెందినట్టు సికింద్రాబాద్‌లోని కిమ్స్ వైద్యులు ధ్రువీకరించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రియాంక మృతదేహాన్ని ప్రైవేట్ దవాఖాన నుంచి గాంధీ దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ తిరిగి వస్తుందనుకున్న ప్రియాంక ఇక ఎప్పటికీ తిరిగిరాదని తెలిసి తల్లిదండ్రులు వెంకటేశ్, చంద్రకళ రోదనలు మిన్నంటాయి.

స్వగ్రామం ఎక్లాస్‌పురం గ్రామం శోక సంద్రంలో మునిగిపోయి ంది. మెడికో విద్యార్థిని ప్రియాంక కేసుపై రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పందించారు. రాజమండ్రి ఘటనపై ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా 3 గంటల్లోనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. సోమవారం గాంధీ ఆస్పత్రికి చేరుకున్న ఎమ్మెల్యే.. ప్రియాంక కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసులో అలసత్వానికి తావులేదని.. లోతైన విచారణ పూర్తి చేసినట్లు చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరించామని, ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అమ్మాయిని వ్యక్తిత్వ హననం చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని హితవుపలికారు. సోషల్ మీడియాలో వస్తోన్న అపోహలు, తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. మరోవైపు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో.. ప్రియాంక మృతదేహానికి పోస్టు మార్టం పూర్తి కావడంతో గద్వాల్ జిల్లా అయిజా మండ లం ఏక్లాస్‌పూర్‌కు ప్రియాంక డెడ్‌బాడీని కుటుంబ సభ్యులు తరలించారు. తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి, రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గాంధీ ఆస్పత్రికి చేరుకుని.. ప్రియాంక తండ్రిని ఓదార్చారు. ప్రియాంక మృతదేహం వెంట ఏక్లాస్‌పూర్ గ్రామానికి రాజమండ్రి టీడీపీ అధ్యక్షుడు వెంకట రమణా చౌదరి వెళ్లనున్నారు. అలాగే ఏపీ మంత్రి టీజీ భరత్.. ప్రియాంక స్వగ్రామానికి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షల చెక్‌ను ప్రియాంక తండ్రికి మంత్రి అందజేయనున్నారు.

# 47 ఏళ్ల తర్వాత... మళ్లీ ఒక్కటైన బాల్య హృదయాలు

**- పెద్దగోపతి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం..**

**- గురువులకు ఘన సన్మానం..**

**- చెరగని జ్ఞాపకాలతో భావోద్వేగానికి లోనైన మిత్రులు**





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 10 (పిసిడబ్ల్యూ న్యూస్):** “ఎక్కడో పుట్టాం.. ఎక్కడెక్కడో పెరిగాం.. కానీ చదువులమ్మ చెట్టు నీడలో మళ్లీ ఒక్కటయ్యాం..” అనే భావోద్వేగాన్ని ఆవిష్కరిస్తూ 47 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్న అపూర్వ దృశ్యం పెద్దగోపతి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆవిష్కృతమైంది. కొణిజర్ల మండలం పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా ఆదివారం జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం చిన్ననాటి జ్ఞాపకాలను సజీవం చేస్తూ.. ఆనాటి స్నేహబంధాలకు మళ్లీ ప్రాణం పోసింది. **ఏళ్లకు ఏళ్లు గడిచిపోయాయి.. జీవితాలు మారిపోయాయి..** ఉద్యోగాలు, బాధ్యతలు, కుటుంబాలు, వివిధ ప్రాంతాల్లో నివాసాలు.. ఇలా ఎవరి జీవిత ప్రయాణం వారిది. కానీ బాల్యంలో ఒకే తరగతి గదిలో కూర్చొని, ఒకే బడి మైదానంలో ఆడుకుని, ఒకే గురువుల వద్ద విద్యను అభ్యసించిన ఆ స్నేహబంధం మాత్రం కాలగర్భంలో కలిసిపోలేదు. 47 ఏళ్ల అనంతరం అందరూ ఒకే చోట చేరడంతో పాఠశాల ప్రాంగణం ఒక్కసారిగా పాత జ్ఞాపకాల పూలవనంగా మారిపోయింది. **గురువుల పాఠాలు.. జ్ఞాపకాల తీపి జాడలు** ఆనాటి సైన్స్ మాస్టారు, లెక్కల పంతులు, తెలుగు చందస్సు, వ్యాకరణం బోధించిన ఉపాధ్యాయుల పేర్లను ఒక్కొక్కరిగా గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. గురువులు చెప్పిన పాఠాలు, స్టడీ అవర్స్, పాఠశాల ప్రారంభ వేళ మోగిన తొలి విజిల్, తరగతి గదిలో జరిగిన చిలిపి చేష్టలు, స్నేహితులతో కలిసి గడిపిన మధుర క్షణాలు ఒక్కొక్కటిగా కళ్లముందు కదలాడాయి. ఆనాడు తమ భవిష్యత్తుకు విద్య పునాదిగా నిలిచిన అదే పాఠశాల.. నేడు తమ జీవిత ప్రయాణానికి దిక్సూచిగా నిలిచిందని పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడి, వివిధ హోదాల్లో పనిచేస్తున్నప్పటికీ తమ మూలాలను, తమ ఎదుగుదలకు బాటలు వేసిన సర్కారు బడిని మరచిపోలేదని తెలిపారు. **మిత్రుల కలయిక.. మధుర జ్ఞాపకాల పల్లకి** పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో చిన్ననాటి మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులను చూసి ఆనందంతో ఆలింగనం చేసుకున్నారు. కొందరి కళ్లలో ఆనందభాష్పాలు కనిపించగా.. మరికొందరు చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటూ నవ్వుకున్నారు. చిన్ననాటి ఫొటోలు, వీడియోలను పరస్పరం పంచుకుంటూ అప్పటి జ్ఞాపకాలను మరోసారి సజీవం చేసుకున్నారు. సాంకేతిక



పరిజ్ఞానం, సోషల్ మీడియా ద్వారా ఒకరినొకరు గుర్తించి ఈ ఆత్మీయ కలయికకు శ్రీకారం చుట్టినట్లు వారు తెలిపారు. కాలం దూరం చేసినా.. స్నేహం మాత్రం తమ హృదయాలను ఎప్పటికీ దూరం చేయలేదని ఆనందం వ్యక్తం చేశారు. **గురువులకు ఘన సన్మానం** తమ జీవితాలకు అక్షర జ్ఞానాన్ని అందించి, భవిష్యత్తుకు బాటలు వేసిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గురువుల ఆశీస్సులు తీసుకుంటూ.. తమ జీవితంలో వారు పోషించిన పాత్రను స్మరించుకున్నారు. గురువులను తిరిగి కలుసుకోవడం, వారి చేతుల మీదుగా ఆశీస్సులు పొందడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. “మాకు ఉద్యోగాలు, హోదాలు, ఆస్తులు ఎన్నో వచ్చి ఉండవచ్చు, కానీ మమ్మల్ని మనుషులుగా తీర్చిదిద్దిన మా బడి, మా గురువులు, మా మిత్రుల జ్ఞాపకాలకు ఏదీ సాటిరాదు” అంటూ పలువురు భావోద్వేగంతో పేర్కొన్నారు. **సర్కారు బడే మా బంధానికి చిరునామా..** తమ జీవిత ప్రయాణంలో ఎవరు ఎక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు? ఎలా ఎదిగారు? అనే విషయాలను పరస్పరం తెలుసుకుంటూ ప్రస్తుత విశేషాలను పంచుకున్నారు. “మా బాల్యానికి సాక్ష్యం.. మా ఎదుగుదలకు పునాది.. మా స్నేహానికి చిరునామా మా సర్కారు బడే” అంటూ పూర్వ విద్యార్థులు గర్వంగా పేర్కొన్నారు. ఈ యాంత్రిక యుగంలో మనుషుల మధ్య దూరాలు పెరుగుతున్న వేళ.. ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు బంధాలను మరింత బలపరుస్తాయని వారు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కలయికలను కొనసాగించాలని ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుకు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలని సంకల్పించారు. 47 ఏళ్ల అనంతరం జరిగిన ఈ సమ్మేళనం కేవలం పూర్వ విద్యార్థుల కలయికగా కాకుండా.. ఒక తరం బాల్యాన్ని మరోసారి మేల్కొలిపిన మధుర జ్ఞాపకాల పండుగగా, గురువుల రుణాన్ని గుర్తుచేసిన ఆత్మీయ వేడుకగా, స్నేహబంధాలకు చిరస్థాయిగా నిలిచే అపురూప ఘట్టంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున శర్మ, యోహాన్‌తో పాటు పూర్వ విద్యార్థులు తిరుపతిరావు, వెంకన్న, నాగేశ్వరరావు, ప్రసాద్, వెంకటరెడ్డి, లక్ష్మి, శారద, చారి, అశోక్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ ట్రేడింగ్‌లో హార్దిక్ పాండ్యా హవా..

ఐపీఎల్ ట్రేడింగ్ విండోలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పేరు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ నుంచి పాండ్యాను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. లక్నో సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు కూడా ఆసక్తిగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు పెద్దగా చర్చలు జరగలేదట. గుజరాత్ టైటాన్స్ జట్టును మొదటి సీజన్లోనే విజేతగా, రెండో సీజన్లో రన్నరప్‌గా నిలబెట్టిన హార్దిక్ పాండ్యా, ముంబై ఇండియన్స్‌లో మాత్రం స్థిరమైన ప్రదర్శన ఇవ్వలేకపోయాడు. మూడు సీజన్లలో ఒకేసారి ప్లే ఆఫ్స్ చేరాడు. కానీ ఫాస్ట్ బౌలింగ్ చేయగల ఆల్‌రౌండర్‌గా, టీమ్‌కు మంచి బ్యాలెన్స్ తెచ్చే లీడర్‌గా ఐపీఎల్‌లో అతడికి మంచి డిమాండ్ ఉంది. అందుకే ఫ్రాంచైజీలు హార్దిక్ కోసం పోటీ పడుతున్నాయి. ముంబై ఒకవేళ ట్రేడింగ్ చేసే యోచనలో ఉంటే, ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన అక్షర్ పటేల్‌తో స్వాప్ చేసుకోవచ్చనే చర్చ సాగుతోంది. అక్షర్ రాకతో ముంబై స్పిన్ విభాగం బలపడటమే కాకుండా విదేశీ ఆల్‌రౌండర్లపై ఆధారపడటం తగ్గుతుంది. అయితే, తమ స్టార్ ఆల్‌రౌండర్‌కు ప్రతిఫలంగా అగ్రశ్రేణి భారతీయ బ్యాటర్ లేదా బౌలర్‌ను మాత్రమే కోరాలని ముంబై భావిస్తోంది. కేకేఆర్ ఫ్రాంచైజీ కామెరూన్ గ్రీన్‌ను ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. కానీ రాబోయే యాషెస్ సిరీస్ దృష్ట్యా అతని లభ్యతపై అనుమానాలు ఉండటంతో ముంబై సుముఖంగా లేదు. అటు సీఎస్కే విషయానికొస్తే, నూతన ఓవర్సీస్ కోచ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాతే హార్దిక్ పాండ్యా ట్రేడ్‌పై నిర్ణయం తీసుకుంటామని సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు.



ఐపీఎల్‌లో ఒక ఆనవాయితీ ఉంది, అదేంటంటే -- ట్రేడింగ్ ద్వారా ప్రత్యర్థి జట్లను బలంగా మార్చకూడదు. పాండ్యా ఫామ్ అంత గొప్పగా ఏమీ లేనప్పటికీ, అతడు వేరే జట్టులోకి వెళ్తే ఆ జట్టు అత్యంత ప్రమాదకరంగా మారుతుందని ముంబై ఇండియన్స్‌కు తెలుసు. అందుకే వేరే జట్టును బలోపేతం చేసే కంటే, తమ జట్టుకు గరిష్ఠ ప్రయోజనం చేకూరే ప్రతిపాదన వస్తేనే పాండ్యాను వదులుకోవాలని ముంబై భావిస్తోంది. ప్రస్తుతం బెంగళూరులోని సీఓఈలో ఫిట్‌నెస్ సాధిస్తున్న హార్దిక్, తన భవిష్యత్తుపై ముంబై నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాడు!

# వామప్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం..



## భారత్ 6 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపు

శ్రీలంక పర్యటన భారత్ ఘనంగా ప్రారంభించింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సన్నాహకంగా శ్రీలంక ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వామప్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆఖరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో టెయిలెండర్ మహమ్మద్ సిరాజ్(15 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 32 నాటౌట్) అద్వితీయమైన బ్యాటింగ్‌తో చిరస్మరణీయమైన విజయాన్ని అందుకుంది. 207 పరుగుల లక్ష్య ఛేదనలో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ నిర్ణీత 45 ఓవర్లలో 4 వికెట్లకు 214 పరుగులు చేసి గెలుపొందింది. యశస్వి జైస్వాల్(46 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61 రిటైర్డ్ హర్ట్) హాఫ్ సెంచరీతో రాణించగా.. శుభ్‌మన్ గిల్(54 బంతుల్లో 7 ఫోర్లతో 44), మహమ్మద్ సిరాజ్(15 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 32 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్లలో కేశర నువాంత(2/57) రెండు వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, రమేష్ మెండీస్ తలో వికెట్ తీసారు. భారత్ విజయానికి ఆఖరి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమయ్యాయి. క్రీజులో టెయిలెండర్ మహమ్మద్ సిరాజ్‌తో పాటు సరాన్ష్ జైన్ ఉండటంతో విజయం కష్టమేనని అంతా అనుకున్నారు. కానీ సిరాజ్ అనూహ్యంగా హ్యాట్రిక్ సిక్స్‌లు బాది విజయాన్ని అందించాడు. శ్రీలంక ఎలెవన్ ప్రధాన బౌలర్ కేశర నువాంత్ వేసిన ఆఖరి ఓవర్‌లో వరుసగా మూడు బంతులను సిక్స్‌లు బాది భారత్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ విజయం భారత్ ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఈ మూడు రోజుల వామప్ మ్యాచ్ ద్వారా భారత ఆటగాళ్లకు కావాల్సిన ప్రాక్టీస్ లభించింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక ఎలెవన్ తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్లకు 363 పరుగులు చేసింది. నిషాన్ ఫెర్నాండో(65 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 66), రావిందు రసంతా(143 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 71), కెప్టెన్ సోనాల్ దినుషా(72 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 52) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా(2/64), కుల్దీప్ యాదవ్(2/76), మానవ్ సుతార్(2/33) రెండేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, యువ బౌలర్ సరాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయారు. అనంతర భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 90 ఓవర్లలో 6 వికెట్లకు 357 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. దేవదత్ పడిక్కల్(164 బంతుల్లో 18 ఫోర్లతో 142 నాటౌట్) అజేయ సెంచరీతో చెలరేగగా.. రవీంద్ర జడేజా(117 బంతుల్లో 7 ఫోర్లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. మానవ్ సుతార్(90 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 41), సరాన్ష్ జైన్(22), గుర్నూర్ బ్రార్(17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 36 నాటౌట్) విలువైన పరుగులు చేశారు.శ్రీలంక ఎలెవన్ బౌలర్లలో రమేష్ మెండీస్, అసంక మనోజ్ రెండేసి వికెట్లు తీయగా.. విశ్వ ఫెర్నాండో, కేశర నువాంత తలో వికెట్ తీసారు. శ్రీలంక ఎలెవన్ రెండో ఇన్నింగ్స్‌లో 45 ఓవర్లలో 6 వికెట్లకు 200 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. నిషాన్ ఫెర్నాండో(73 బంతుల్లో 10 ఫోర్లతో 63), నిపున్ ధనంజయ(56 బంతుల్లో 5 ఫోర్లతో 46), అంజల బండార(48 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 35) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీయగా.. గుర్నూర్ బ్రార్(2/37), రవీంద్ర జడేజా(2/33) రెండేసి వికెట్లు తీసారు. దాంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని భారత్ ముందు 207 పరుగుల లక్ష్యం నమోదైంది.

# కింగ్ కోహ్లీ ఓ మిస్టరీ బౌలర్

## • స్టార్ క్రికెటర్ మార్కస్ స్టోయినీస్



ఛేజ్ మాస్టర్, రన్ మెషీన్, టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన స్టార్ బ్యాటర్ అని అందరికీ తెలిసిన విషయమే. కానీ ఆస్ట్రేలియా ఆల్ రౌండర్, పంజాబ్ కింగ్స్ స్టార్ క్రికెటర్ మార్కస్ స్టోయినీస్ తన బ్యాక్‌యార్డ్ క్రికెట్ (పరదాల మధ్య సరదాగా ఆడే క్రికెట్) జట్టు కోసం టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లీని ఓ బౌలర్‌గా సెలెక్ట్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. విరాట్ కోహ్లీని ప్రపంచమంతా గొప్ప బ్యాటర్‌గా భావిస్తుంటే.. మార్కస్ స్టోయినీస్ మాత్రం అతడిని బౌలర్‌గా ఎంచుకోవడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. స్టార్ స్పోర్ట్స్ యూట్యూబ్ ఛానెల్లో మార్కస్ స్టోయినీస్ ఈ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నాడు. బ్యాక్‌యార్డ్ క్రికెట్లో విరాట్ కోహ్లీ వేసే పార్ట్-టైమ్ బౌలింగ్ అత్యంత విచిత్రంగా, బ్యాటర్లకు అర్థం కాని విధంగా ఉంటుందని స్టోయినీస్ పేర్కొన్నాడు. విరాట్ కోహ్లీ బౌలింగ్ స్టైల్ సాధారణంగా మిగతా బ్యాటర్లకు పెద్దగా పరిచయం ఉండదు కాబట్టి.. కోహ్లీ ఓ మిస్టరీ బౌలర్‌గా ప్రత్యర్థులను బోల్తా కొట్టించగలడని స్టోయినీస్ సరదాగా వివరించాడు. విరాట్ కోహ్లీ తన కెరీర్ ప్రారంభంలో భారత్ తరఫున, ఐపీఎల్ లో ఆర్సీబీ తరఫున అప్పుడప్పుడు బౌలింగ్ చేసేవాడు. విరాట్ కోహ్లీ అంతర్జాతీయంగా టీ20ల్లో 4 వికెట్లు, వన్డేల్లో 5 వికెట్లు పడగొట్టాడు. టెస్టుల్లో మాత్రం విరాట్ కోహ్లీకి వికెట్ దక్కలేదు. ఐపీఎల్‌లో ఆర్సీబీ తరఫున విరాట్ కోహ్లీ ఇప్పటివరకు 4 వికెట్లు తీశాడు. 2016లో గుజరాత్ లయన్స్ జట్టుపై 25 పరుగులిచ్చి 2 వికెట్లు తీయడం కోహ్లీ బెస్ట్ బౌలింగ్ గణాంకాలు కావడం గమనార్హం. చివరగా విరాట్ కోహ్లీ భారత్ తరఫున 2023 వన్డే ప్రపంచ కప్ లో నెదర్లాండ్స్ తో జరిగిన మ్యాచ్ లో బౌలింగ్ చేశాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆ మ్యాచ్‌లో డచ్ కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ ను ఔట్ చేసి దాదాపు 9 ఏళ్ల తర్వాత వన్డేల్లో వికెట్ సాధించాడు. అంతేకాకుండా తన హోమ్ టీమ్ ఢిల్లీ తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్లో 3 వికెట్లు, లిస్ట్-ఏ క్రికెట్లో 5 వికెట్లు పడగొట్టాడు. టెస్టులు, టీ20ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్ కోహ్లీ.. ప్రస్తుతం వన్డేలు, ఐపీఎల్ లో మాత్రమే కొనసాగుతున్నాడు. రాబోయే వెస్టిండీస్ తో స్వదేశంలో జరగబోయే వన్డే సిరీస్ లో విరాట్ కోహ్లీ తిరిగి భారత జట్టు తరఫున మైదానంలోకి దిగే అవకాశాలు ఉన్నాయి.

# టోబీ అల్బర్ట్ సిక్సర్ల విధ్వంసం



ఇంగ్లాండ్‌లో జరుగుతున్న మెట్రో బ్యాంక్ వన్డే కప్‌లో హాంప్‌షైర్ బ్యాటర్ టోబీ అల్బర్ట్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో సంచలనం సృష్టించాడు. మైదానంలో నాన్‌స్టాప్‌గా విరుచుకుపడిన అతను వరుసగా 6 బంతుల్లో 6 సిక్సర్లు బాది క్రికెట్ ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. 21 పరుగుల వద్ద క్యాచ్ డ్రాప్ అయి లభించిన అవకాశాన్ని చక్కగా ఉపయోగించుకుని కేవలం 37 బంతుల్లోనే 86 పరుగుల నాటౌట్ ఇన్నింగ్స్ ఆడి హాంప్‌షైర్ జట్టుకు భారీ స్కోరు అందించాడు.క్రికెట్ చరిత్రలో హర్షెల్ గిబ్స్ (2007 వన్డే వరల్డ్ కప్), యువరాజ్ సింగ్ (2007 టీ20 వరల్డ్ కప్) ఒకే ఓవర్లో 6 సిక్సర్లు కొట్టి రికార్డు సృష్టించారు. అయితే టోబీ అల్బర్ట్ రికార్డు కాస్త భిన్నమైనది. ఇతను ఒకే ఓవర్లో కాకుండా రెండు వేర్వేరు ఓవర్లలో కలిపి ఈ వరుస 6 సిక్సర్ల ఘనతను సాధించాడు. మొదట నాంటెస్ ఓస్టుయిజెన్ వేసిన ఓవర్ చివరి రెండు బంతులను సిక్సర్లుగా మలిచాడు. ఆ తర్వాత ఓలీ కిర్టీ వేసిన తదుపరి ఓవర్లోని చివరి 4 బంతులను వరుసగా సిక్సర్లుగా మలచి వరుసగా 6 బంతుల్లో 6 సిక్సర్ల మార్కును అందుకున్నాడు. టోబీ అల్బర్ట్ 21 పరుగుల వద్ద ఉన్నప్పుడు ససెక్స్ ఫీల్డర్లు అతనికి ఒక సులువైన క్యాచ్‌ను నేలపాలు చేసి లైఫ్ లైన్ ఇచ్చారు. అక్కడి నుంచి గేర్ మార్చిన టోబీ, మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 37 బంతుల్లో 8 సిక్సర్లు, 5 ఫోర్ల సాయంతో 86 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. టోబీ అల్బర్ట్ కంటే ముందు హాంప్‌షైర్ ఓపెనర్లు అలీ ఓర్ (105), బెన్ మేస్ (109) కూడా అద్భుతమైన సెంచరీలతో రాణించారు. ఈ ముగ్గురు బ్యాటర్ల తుఫాను ఇన్నింగ్స్‌ల పుణ్యమా అని హాంప్‌షైర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 383 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అనంతరం 384 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ససెక్స్ జట్టు, హాంప్‌షైర్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక 332 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో హాంప్‌షైర్ జట్టు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

# రిషభ్ పంత్ విలక్షణ ప్రవర్తన..



భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మైదానంలో ఉంటే ఎంటర్‌టైన్‌మెంట్‌కు కొదవ ఉండదు. తన బ్యాటింగ్‌తోనే కాకుండా చేష్టలతోనూ అతడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. తాజాగా శ్రీలంక లెవెన్‌తో జరిగిన వార్మప్ మ్యాచులోనూ అదే జరిగింది. కొలంబో వేదికగా జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో పంత్ తన బ్యాటింగ్ శైలితోనే కాక, ఫుట్‌బాల్ నైపుణ్యాలతోనూ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో త్వరగానే పెవిలియన్ చేరిన పంత్, రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం పూర్తి భిన్నమైన వ్యూహంతో మైదానంలోకి అడుగుపెట్టాడు. రెండో ఇన్నింగ్స్ ప్రారంభంలో అత్యంత జాగ్రత్తగా ఆడాడు. ఎంతలా అంటే.. మొదటి 21 బంతుల వరకు పరుగుల ఖాతానే తెరవలేదు. ధాటిగా ఆడే పంత్ ఇలా సుదీర్ఘంగా డిఫెన్స్ ఆడటం చూసి డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సైతం ఆశ్చర్యపోయాడు. అయితే క్రీజులో కుదురుకున్నాక పంత్ తన అసలు రూపాన్ని బయటకు తీశాడు. శ్రీలంక బౌలర్లు కేశవ నువంత, దిలుమ్ సుదీరల బౌలింగ్‌లో విరుచుకుపడుతూ మూడు భారీ సిక్సర్లతో చెలరేగిపోయాడు. పంత్ సిక్సర్ల హోరును అడ్డుకోవడానికి స్పిన్నర్ సుదీర వైడ్ లెగ్ స్టంప్ దిశగా బంతులు వేయడం ప్రారంభించాడు. అయితే ఆ బంతులను వదిలేయకుండా, పంత్ తన కాళ్లతో ఫుట్‌బాల్ ప్లేయర్‌లా బంతిని వెనక్కి తన్నుతూ విన్యాసాలు చేశాడు. పంత్ చేసిన ఈ క్రేజీ పని చూసి మైదానంలోని ఆటగాళ్లతో పాటు ప్రేక్షకులు కూడా నవ్వేశారు. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ వార్మప్ మ్యాచ్‌లో భారత జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించి గాలే టెస్టుకు ముందు మంచి ఆత్మవిశ్వాసాన్ని మూటగట్టుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో బౌలర్లు శ్రమించినప్పటికీ, రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు మెరుపులు మెరిపించారు. ఆగస్టు 15న గాలే వేదికగా భారత్, శ్రీలంక జట్ల మధ్య తొలి టెస్టు జరగనుంది. రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి కొలంబోలోని ఎస్ఎస్‌సీ మైదానంలో జరగనుంది.

# కిరణ్ అబ్బవరం 'ఇంద్రపుత్ర'..

## పాన్ ఇండియా స్థాయిలో భారీ మైథలాజికల్ చిత్రం






వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యువ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళుతున్నారు. ప్రాంతీయ చిత్రాల పరిధిని దాటి పాన్ ఇండియా స్థాయిలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా 'ఇంద్రపుత్ర' అనే భారీ మైథలాజికల్ యాక్షన్ ఫాంటసీ చిత్రాన్ని సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇది కిరణ్ కు 15వ చిత్రం.

ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్, గతంలో సుధీర్ బాబుతో 'జటాధార' నిర్మించిన ప్రేరణ అరోరా ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శ్రీకాంత్ పుప్పాల ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు దర్శకత్వం వహించనున్నారు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో రాబోయే ఒక సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది తొలి భాగంగా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ 2026 అక్టోబరులో ప్రారంభం కానుంది. 2027లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.కెరీర్ ఆరంభంలో కొన్ని పరాజయాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్న కిరణ్ అబ్బవరం, ఇటీవల కాలంలో బలంగా పుంజుకున్నారు. 'కా', 'కే రాంప్', 'చెన్నై లవ్ స్టోరీ' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి ఆయనకు మంచి మార్కెట్‌ను అందించాయి. ఈ విజయాలతో వచ్చిన ఆత్మవిశ్వాసంతోనే ఆయన ఇప్పుడు పాన్ ఇండియా ప్రాజెక్టులపై దృష్టి సారించారు.ప్రస్తుతం కిరణ్ చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. తన 13వ చిత్రంగా 'రియాలిటీ' అనే సినిమాను స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి నిర్మిస్తున్న ఈ చిత్రంతో కన్నడ నటి దేవిక భట్ పరిచయమవుతున్నారు. ఈ సినిమాను 2026 డిసెంబరులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనితో పాటు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై వీర కొగటం దర్శకత్వంలో ఓ క్రైమ్ థ్రిల్లర్‌లో కూడా కిరణ్ నటిస్తున్నారు. వరుస చిత్రాలతో బిజీగా ఉంటూనే, 'ఇంద్రపుత్ర' వంటి భారీ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో తనదైన ముద్ర వేయాలని కిరణ్ అబ్బవరం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

# కొడుక్కి రామ్ చరణ్ పేరు..

## అభిమాని ప్రేమకు ఫిదా.. ఇంటికి పిలిచిన చిరంజీవి!




మెగాస్టార్ చిరంజీవి తన అభిమానులను సొంత కుటుంబ సభ్యుల్లా చూస్తారనడానికి మరో సంఘటన నిదర్శనంగా నిలిచింది. ఓ సాధారణ టెక్నీషియన్ చూపిన అభిమానానికి ముగ్ధుడై, అతడి కుటుంబాన్ని ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించి ఆశ్చర్యపరిచారు. ఈ ఆత్మీయ భేటీలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా పాల్గొనడం విశేషం. ఈ హృద్యమైన ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం చిరంజీవి 'మెగా 158' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి కెమెరా విభాగంలో పనిచేస్తున్న నివాస్ అనే టెక్నీషియన్‌ను చిరంజీవి పలకరించారు. మాటల సందర్భంలో నివాస్ తాను రామ్ చరణ్‌కు వీరాభిమానినని, ఆ అభిమానంతోనే తన కుమారుడికి 'జస్వంత్ రామ్ చరణ్' అని పేరు పెట్టుకున్నానని చిరంజీవితో చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ ఎంతో సంతోషించి, భావోద్వేగానికి గురయ్యారు.వెంటనే నివాస్‌ను తన కుటుంబంతో సహా ఇంటికి రావాలని ప్రేమగా ఆహ్వానించారు. మెగాస్టార్ పిలుపుతో ఆనందంలో మునిగిపోయిన నివాస్, తన కుటుంబంతో కలిసి ఆయన నివాసానికి వెళ్లారు. అక్కడ వారికి మరో సర్‌ప్రైజ్ ఎదురైంది. చిరంజీవితో పాటు రామ్ చరణ్ కూడా వారిని ఆప్యాయంగా పలకరించి, వారితో సమయం గడిపారు. ముఖ్యంగా చిన్నారి జస్వంత్ రామ్ చరణ్‌తో చరణ్ కాసేపు సరదాగా గడిపారు. అనంతరం నివాస్ కుటుంబంతో కలిసి చిరు, చరణ్ ఫొటోలు దిగారు.ఈ అరుదైన క్షణాలకు సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ హీరోల గొప్ప మనసును ప్రశంసిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఓ సాధారణ అభిమానికి మెగా ఫ్యామిలీ ఇచ్చిన గౌరవం, వారి మధ్య ఉన్న బంధానికి నిదర్శనమని అంటున్నారు.

# బాబీ దర్శకత్వంలో చిరు చిత్రం..

# గెస్ట్ రోల్‌లో యంగ్ బ్యూటీ?



మెగాస్టార్ చిరంజీవి తన 158వ చిత్రాన్ని దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించి ప్రస్తుతం ఫిలింనగర్‌లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో యువ నటి మీనాక్షి చౌదరి ఒక కీలక పాత్రలో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ చిత్రంలోని ఒక పాత్ర కోసం చిత్రబృందం మీనాక్షి చౌదరితో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, ఆమె ఇందులో కథానాయికగా కాకుండా, ఒక కీలకమైన అతిథి పాత్రలో మాత్రమే కనిపించనున్నారని సమాచారం. ముఖ్యంగా సినిమా ద్వితీయార్ధంలో ఆమె పాత్రకు సంబంధించిన సన్నివేశాలు ఉంటాయని తెలుస్తోంది.ప్రస్తుతం ఈ సినిమాలో కథానాయిక ఎవరనే దానిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో అసలు ఈ చిత్రంలో పూర్తిస్థాయి హీరోయిన్ పాత్ర ఉంటుందా? లేదా? అనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎస్ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో సినిమాను విడుదల చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, మీనాక్షి చౌదరి చేరికపై చిత్ర యూనిట్ నుంచి అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.




# ముందు కాల్చి, తర్వాతే మాట్లాడతాం..

## 'స్లమ్‌డాగ్' నుంచి టబు పవర్‌ఫుల్ గ్లింప్స్!

స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్‌డాగ్ – 33 టెంపుల్ రోడ్'. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి, కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు క్యారెక్టర్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.ఈ సినిమాలో టబు 'గౌరీ హెగ్డే' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "భయంలేని, శక్తివంతమైన, ధైర్యవంతురాలు. భారతీయ సినిమా రత్నం టబును గౌరీ హెగ్డేగా పరిచయం చేస్తున్నాం" అని పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. విడుదలైన వీడియోలో టబు తన పాత్రలో ఒదిగిపోయారు. కొందరిని కొడుతూ, బెదిరిస్తూ పవర్‌ఫుల్ ఆఫీసర్‌గా కనిపించారు. "మా స్టైల్‌లో మేము ముందు కాల్చి, ఆ తర్వాత మాట్లాడతాం" అంటూ విజయ్ సేతుపతికి ఆమె చెప్పే డైలాగ్ గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచింది. చివర్లో "గౌరీ హెగ్డే – డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్" అని ఆమె తన హోదాను వెల్లడించడం ఆకట్టుకుంది.

గతేడాది జులైలో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి చేతిలో కత్తి, చుట్టూ డబ్బు కట్టలతో కనిపించి సినిమాపై క్యూరియాసిటీ పెంచారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్.. జేబీ మోషన్ పిక్చర్స్‌తో కలిసి జేబీ నారాయణరావు కొండ్రొళ్ల నిర్మిస్తున్నారు.

ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ దునియా విజయ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ వంటి నటులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. 'అర్జున్ రెడ్డి' (నేపథ్య సంగీతం), 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సంగీతం అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


# కపాలిలో హన్సిక ఫస్ట్ లుక్ విడుదల




నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

# అమెరికా దద్దరిల్లేలా ప్లాన్

## టాక్సిక్ మెగా రిలీజ్!



రాకింగ్ స్టార్ యశ్ నటించిన 'కేజీఎఫ్' ఊచకోత తర్వాత వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'టాక్సిక్'. ఈ సినిమా కోసం భారతీయ సినీ ప్రేక్షకులు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ చిత్రం అమెరికాలో మైండ్ బ్లాకయ్యే రేంజ్‌లో భారీ విడుదలకు సిద్ధమవుతోంది. అక్కడ ఏకంగా 2000 పైచిలుకు స్క్రీన్లలో ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు మేకర్స్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక దీంతో ఓవర్సీస్‌లో ఇండియన్ సినిమా చరిత్రలోనే ఇది ఒక సరికొత్త రికార్డుగా నిలవబోతోంది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ మూవీ అమెరికా థియేటర్లలో సరికొత్త హంగామా సృష్టించబోతోంది. అక్కడి అగ్ర పంపిణీదారులు ఒక భారతీయ సినిమాకు ఈ స్థాయిలో 2,000 కంటే ఎక్కువ స్క్రీన్లు కేటాయించడం చాలా అరుదు. ఇక రాకింగ్ స్టార్ యశ్ కు ఉన్న గ్లోబల్ మేనియాని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 26న విడుదల కానున్న ఈ సినిమా అమెరికా ప్రీమియర్స్ కలెక్షన్లలో పాత రికార్డులన్నింటినీ తుడిచిపెట్టేలా కనిపిస్తోంది. 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రాన్ని కేవలం భారతీయ భాషల్లోనే కాకుండా ఇంగ్లీష్‌తో సహా మొత్తం ఆరు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ఇక కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ భారీ గ్యాంగ్‌స్టర్ థ్రిల్లర్‌లో యష్ నటుడిగానే కాకుండా సహ నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. అధికారం, ద్రోహం, ప్రతీకారం చుట్టూ తిరిగే కథతో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ఇప్పటికే నెట్టింట ట్రెండ్ అవుతూ సినిమాపై అంచనాలను ఆకాశానికి ఎత్తేసింది.